Follow: @ANNTELUGU
ANN తెలుగు
REGISTERED NUMBER APTEL/2014/58382
23-10-2025
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 317 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM



## రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం

### పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, మహా:** ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై రేవంత్ రెడ్డి తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### దానం సపోర్ట్ చేస్తే తప్పేంటి?



- మా పార్టీకి బహిరంగంగానే మద్దతు ఇస్తున్నారు
- కొండా వివాదం క్లోజ్.. జీవన్ రెడ్డిని త్వరలోనే సెట్ చేస్తాం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హాట్ కామెంట్స్

02

### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బుమ్రా టాప్



- వన్డే ర్యాంకుల్లోకి పునరాగమనం చేసిన సిరాజ్

02

### ఒక్క రోజులోనే రూ.10 వేలు



- తగ్గిన బంగారం ధర
- వెండి ఢమాల్.. భారీ పతనం

02



02

### జూబ్లీహిల్స్‌పై కేసీఆర్ నజర్

- ఫామ్ హౌస్‌లో కేటీఆర్, హరీశ్ రావు భేటీ
- ఉప ఎన్నిక రోడ్‌షోలు, ప్రచార వ్యూహాలపై చర్చలు
- తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపైనా మంతనాలు
- జూబ్లీహిల్స్ లోని వివిధ ప్రాంతాల ఇన్‌ఛార్జ్‌లతో నేడు కేసీఆర్ సమావేశం



### సీనియర్లకు బైబై

- కర్ణాటకలో కామరాజ్ ప్లాన్
- కాంగ్రెస్ ముమ్మర కసరత్తు
- సగం కేబినెట్ లో కొత్త రక్తం




### నేడు కేబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం

సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కీలక నిర్ణయాలు

## నవంబర్ 20 తర్వాత స్థానిక ఎన్నికలు?

స్థానిక సంస్థలకు రాష్ట్ర సర్కారు ఇదివరకే సై అన్నా.. రిజర్వేషన్లపై వచ్చిన సాంకేతిక ఇబ్బందులతో బ్రేక్ పడింది. అయితే ఇపుడు స్థానిక ఎన్నికలు ఎపుడు నిర్వహిస్తారని హైకోర్టు ప్రశ్నించిన నేపథ్యంలో గురువారం జరిగే కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గత నెల 17న స్థానిక ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై విచారించింది. ఈ సందర్భంగా ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని న్యాయస్థానం ప్రశ్నించగా రెండు వారాల్లో చెబుతామని ఏజీ ధర్మాసనానికి తెలిపారు. నవంబర్ 1 లోగా ఎన్నికల నిర్వహణ ఎప్పుడనే విషయం కోర్టుకు తెలపాల్సి ఉంది. ఈ మేరకు అఫిడవిట్ వేయాల్సి ఉంటుంది. దీంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ల నుంచి ప్రభుత్వానికి ఒత్తిడి కూడా ఉంది. గత కేబినెట్ సమావేశంలో మెజారిటీ మంత్రులు కూడా స్థానిక ఎన్నికలు త్వరగా నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. - మహా, హైదరాబాద్,

వివరాలు 2లో

### జూబ్లిహిల్స్ నామినేషన్లలో

## స్టేట్ రికార్డ్

### నవీన్ యాదవ్, సునీత నామినేషన్లకు గ్రీన్ సిగ్నల్

భారీగా నామినేషన్ల తిరస్కరణ





**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో రికార్డుస్థాయిలో నామినేషన్లు దాఖలు కావడంతో స్క్రూటినీకి చాలా సమయం పట్టింది. రికార్డు స్థాయిలో 321 నామినేషన్లు దాఖలు కాగా, ఇది స్టేట్ రికార్డు. అయితే ఈ బై పోల్ లో బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత నామినేషన్లు ఆమోదం పొందాయి. చాలా నామినేషన్లు వచ్చినప్పటికీ.. పోటీ ఈ రెండు పార్టీల మధ్యనే ఉండటంతో వీరి నామినేషన్ల పరిశీలపై ఉత్కంఠతగా ఎదురు చూసారు నాయకులు, కార్యకర్తలు. అయితే తన నామినేషన్ పై బీఆర్ఎస్ నేతలు తప్పుడు అభ్యంతరాలు వ్యక్తం చేసారని నవీన్ యాదవ్ పేర్కొన్నారు. నామినేషన్లో అంతా కరెక్టుగానే ఉండటంతో ఎన్నికల అధికారి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పేర్కొన్నారు. తాను ఎవ్వరినీ వ్యక్తిగతంగా దూషించనని, ఎవ్వరి నామినేషన్ మీద అభ్యంతరం చేయలేదని, అభివృద్ధే ఆయుధంగా ముందుకు వెళతానని అన్నారు. ఇటు మాగంటి సునీత మీద గోపినాథ్ మొదటి భార్య కొడుకు పలు ఆరోపణలు చేస్తూ.. ఆమె నామినేషన్ రద్దు చేయాలని ఈసీకి ఫిర్యాదు చేసారు. అయితే వీటిని పట్టించుకోకుండా రికార్డు ఆధారంగా ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు భారీగా నమోదైన నామినేషన్లలో చాలా వరకు సరిగ్గా లేకపోవడంతో పెద్ద మొత్తంలో తిరస్కరణకు గురయ్యాయి.

## పాక్‌లో ధరల మంటలు

### కిలో టమాటా రూ. 600, అల్లం రూ. 750.. బెండ రూ.300, ఉల్లి 120

**మహా:** పక్కనే ఉన్న దాయాది దేశం పాకిస్థాన్‌లో కూరగాయల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తల కారణంగా నిత్యావసరాల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి.

మిగతా 2లో



## రాష్ట్రంలోని చెక్ పోస్టులన్నీ రద్దు

### రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులను తక్షణమే మూసివేయాలి

### రికార్డులు, క్యాష్ బుక్స్, రిసిప్టులు, చలాన్లను అన్నింటినీ భద్రపరచాలి

### రవాణా కమిషనర్, డీటీఓలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రవాణా శాఖకు సంబంధించిన అన్ని చెక్ పోస్టులను తక్షణమే మూసివేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రవాణా కమిషనర్ డీటీఓలకు ఆదేశాలు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా రవాణా అధికారులు (డీటీఓ) స్వయంగా చెక్ పోస్టుల వద్ద ప్రస్తుతం ఉన్న బోర్డులను, బారికేడ్లను తొలగించే కార్యక్రమాన్ని

మిగతా 2లో




### సైన్స్, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు

## హైదరాబాద్ కేంద్రం

### హైదరాబాద్‌కు సైన్స్‌తో చిరకాల అనుబంధం

ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాం: భట్టి విక్రమార్క

బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025 సదస్సుకు హాజరైన డిప్యూటీ సీఎం




**హైదరాబాద్, మహా:** జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి సైన్స్, ఆవిష్కరణలకు హైదరాబాద్ కేంద్రంగా విరాజిల్లుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం జేసీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025 - ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్పేస్ ఎకానమీ, బయోమిమిక్రి అండ్ ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్

మిగతా 2లో



### ఆదిలాబాద్‌లో దండారీలతో కంది

కంది శ్రీనివాస రెడ్డి గుస్సాడీ నృత్యం

ఆదివాసీలతో మమేకం


05

### తెలంగాణలో నాలుగు రోజులు పాటు

## వానలే వానలు!

దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

02





# నవంబర్ 20 తర్వాత స్థానిక ఎన్నికలు?

## నేడు కేబినెట్‌లో నిర్ణయం తీసుకునే అవకాశం

## సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కీలక నిర్ణయాలు

**మహా, హైదరాబాద్**

స్థానిక సంస్థలకు రాష్ట్ర సర్కారు ఇదివరకే సై అన్నా.. రిజర్వేషన్లపై వచ్చిన సాంకేతిక ఇబ్బందులతో బ్రేక్ పడింది. అయితే ఇపుడు స్థానిక ఎన్నికలు ఎపుడు నిర్వహిస్తారని హైకోర్టు ప్రశ్నించిన నేపథ్యంలో గురువారం జరిగే కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గత నెల 17న స్థానిక ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై విచారించింది. ఈ సందర్భంగా ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని న్యాయస్థానం ప్రశ్నించగా రెండు వారాల్లో చెబుతామని ఏజీ ధర్మాసనానికి తెలిపారు. నవంబర్ 1 లోగా ఎన్నికల నిర్వహణ ఎప్పుడనే విషయం కోర్టుకు తెలపాల్సి ఉంది. ఈ మేరకు అఫిడవిట్ వేయాల్సి ఉంటుంది. దీంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ల నుంచి ప్రభుత్వానికి ఒత్తిడి కూడా ఉంది. గత కేబినెట్ సమావేశంలో మెజారిటీ మంత్రులు కూడా స్థానిక ఎన్నికలు త్వరగా నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

**రిజర్వేషన్లపై చర్చ**

గతంలో ఈసీ జారీ చేసిన షెడ్యూల్ లో బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 ప్రకారం అని ఉంది. ఇందులో జీవో నంబర్ 9 పై హైకోర్టు స్టే విధించింది. ఈ క్రమంలో కొత్త షెడ్యూల్ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రకారం రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటకూడదని న్యాయస్థానాలు సూచించిన నేపథ్యంలో మొత్తం రిజర్వేషన్లన్నీ రద్దుచేసి, మళ్ళీ మొదటినుండి వస్తారా? కేవలం బీసీ సీట్ల విషయంలోనే మార్పులుచేర్పులు చేస్తారా అన్నది చూడాల్సి ఉన్నది. ఎన్నికలకు వెళ్లాల్సి వస్తే.. పార్టీ పరంగా 42% సీట్లను బీసీలకు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ 42% సీట్లను బీసీలకు కేటాయిస్తే మిగతా పార్టీలు కూడా ఫాలో అయ్యే అవకాశం ఉంది. అయితే బీసీ రిజర్వేషన్ల కోసం సర్వశక్తులు ఒడ్డామని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సహకరించలేదని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహంగా ఉంది. బీజేపీ, బీఆర్ఎస్ వల్లే బీసీ రిజర్వేషన్లకు బ్రేకులు పడ్డాయని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రచారం నిర్వహించే అవకాశాలున్నాయి. నవంబర్ 11న బీహార్, జూబ్లీ హిల్స్ పోలింగ్ ముగియనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి. నవంబర్ 20 తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించాలనే ఉద్దేశ్యంతో సర్కారు ఉందని, నవంబర్ 11, 12 తేదీల్లో రిజర్వేషన్లు ఫైనల్ చేసి నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. గురువారం జరిగే కేబినెట్ భేటీపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

# సీనియర్లకు బైబై

## కర్ణాటకలో కామరాజ్ ప్లాన్.. కాంగ్రెస్ ముమ్మర కసరత్తు.. సగం కేబినెట్ లో కొత్త రక్తం



**బెంగళూరు, మహా :** కాంగ్రెస్ హైకమాండ్ సంచలనాలకు సై అంటోంది. పార్టీ యువరక్తాన్ని నింపేందుకు.. కీలక బాధ్యతల్లో యువతకు అవకాశం కల్పించేందుకు సన్నద్ధమవుతోంది. ముందుగా కర్ణాటకలో కీలక మార్పులు, చేర్పులు చేపట్టేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధమవుతోంది. ఇందుకోసం కామరాజ్ ప్లాన్ ను అమలు చేసే యోచనలో ఉన్నట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ ప్రకారం పనితీరు, అవినీతి ఆరోపణల ఆధారంగా పలువురు సీనియన్ నేతలకు రాష్ట్ర మంత్రివర్గం నుంచి ఉద్వాసన పలకనుంది. ఈ ఏడాది చివర్లో చేపట్టే ఈ మార్పులు, చేర్పుల్లో సుమారు డజను మంది సీనియర్ మంత్రులను తప్పించి, వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పిస్తారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకోనుండటం, రొటేషనల్ పద్ధతిలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు పదోన్నత కల్పించనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఖాయంగా జరగనుంది. కామరాజ్ ప్లాన్‌ను కర్ణాటకలో అమలు చేస్తే డీకే సైతం ప్రస్తుతం ఉన్న రెండు పదవుల్లో ఒక దానికే పరిమితం కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆయన ఉపముఖ్యమంత్రి పదవితోపాటు పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఉన్నారు.

**పార్టీ పునర్నిర్మాణమే కామరాజ్ ప్లాన్**

ప్రముఖ రాజకీయ నేత అయిన కుమారస్వామి కామరాజ్ (19031975) స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడంతోపాటు అప్పటి మద్రాస్ స్టేట్ (ప్రస్తుతం తమిళనాడు)కు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడుగానూ ఉన్నారు. భారత రాజకీయాల్లో 'కింగ్‌మేకర్'గా ఆయన పేరు తెచ్చుకున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ప్రధానమంత్రులు కావడంలో కీలకపాత్ర పోషించారు. 1963లో అప్పటి మద్రాస్ ముఖ్యమంత్రిగా ఉన్న కామరాజ్ ఆ తర్వాత ఐఎన్‌సీ(ఓ) అధ్యక్షుడయ్యారు. పార్టీ పునర్నిర్మాణం కోసం సీనియర్ నేతలు ప్రభుత్వ పదవుల నుంచి తప్పుకోవాలని కామరాజ్ ప్రతిపాదించారు. పార్టీ ఆర్గనైజేషన్‌ను అట్టడుగు స్థాయి నుంచి పటిష్టం చేయడం ఈ ప్లాన్ ముఖ్యోద్దేశం. అందులో భాగంగా కామరాజ్ ప్లాన్ ను ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తోంది. స్తబ్ధత ఏర్పడినపుడల్లా కామరాజ్ ప్లాన్ ను అమలుచేయడం ఆనవాయితీగా కాంగ్రెస్ లో జరుగుతోంది. కర్నాటక తర్వాత ఇతర రాష్ట్రాలకు కూడా దీనిని అమలుచేసే అవకాశాలున్నాయి.

# సైన్స్, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు హైదరాబాద్ కేంద్రం

## హైదరాబాద్‌కు సైన్స్‌తో చిరకాల అనుబంధం

### ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాం: భట్టి విక్రమార్క

### బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్2025 సదస్సుకు హాజరైన డిప్యూటీ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

రిసోర్స్ సదస్సులో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ప్రపంచ స్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ నిలిచింది అన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కట్టుబడి ఉంది అన్నారు. హైదరాబాదు నగరానికి ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలకు ఆయన స్వాగతం తెలిపారు. శాస్త్ర సున్నితత్వం, కల్పనాత్మకత కవిత్వం కలిసిన ఈ నగరం ఎప్పుడూ సృజనాత్మకతకు నిలయంగా నిలిచింది అన్నారు. బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025—జీవశాస్త్రం, సాంకేతికత, అంతరిక్ష అన్వేషణల మధ్య జరుగుతున్న ఈ ప్రపంచ స్థాయి సంభాషణ భారత శాస్త్రీయ గమ్యాన్ని అర్ధ శతాబ్దానికి పైగా నిశ్శబ్దంగా మలిచిన ఈ నగరంలో జరుగుతుండటం గర్వకారణం అని అన్నారు.

**భారతదేశపు "ఆకాశనేత్రం" మార్చింది..**

హైదరాబాద్‌కు సైన్స్‌తో ఉన్న అనుబంధం లోతైనది, చిరకాలమైనది అన్నారు డిప్యూటీ సీఎం. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో, ఈ నగరంలో అనేక శాస్త్రీయ సంస్థలు పునాది వేసుకున్నాయి అని వివరించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ)——మునుపటి ఎన్ఆర్ఎస్ఏ——హైదరాబాద్‌ను భారతదేశపు "ఆకాశనేత్రం"గా మార్చిందని, ఉపగ్రహ చిత్రాలను వ్యవసాయం, నీటి వనరులు, విపత్తు నిర్వహణలో వినియోగిస్తూ మార్గదర్శిగా నిలిచిందని తెలిపారు. ఇక్కడ రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ), డీఆర్డీఎల్, డీఎంఆర్ఎల్, ఆర్సీఎల్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రయోగశాలలను స్థాపించి, దేశానికి క్షిపణి, పదార్థ సైన్స్ లో నైపుణ్యాన్ని అందించిన తరతరాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత హైదరాబాద్ కు సొంతం అన్నారు. ఇవే కాకుండా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), మిశ్ర ధాతు నిగమ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) వంటి పబ్లిక్ రంగ సంస్థలు కూడా ఇక్కడే ఎదిగి, దేశానికి విమానయాన, లోహశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో బలమైన పునాది వేశాయి అని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు.



# ఐసీసీ ర్యాంకింగ్స్ లో బుమ్రా టాప్

## వన్డే ర్యాంకుల్లోకి పునరాగమనం చేసిన సిరాజ్

**మహా :** ఐసీసీ తాజాగా విడుదల చేసిన టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే, అతడికి పాకిస్థాన్ బౌలర్ నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. పాక్ స్పిన్నర్ నోమాన్ అలీ అద్భుత ప్రదర్శనతో రెండో స్థానానికి దూసుకురావడంతో బుమ్రా ఆధిక్యం కేవలం 29 పాయింట్లకు పడిపోయింది. దక్షిణాఫ్రికాతో లాహోర్‌లో జరిగిన టెస్టులో నోమాన్ అలీ 10 వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. ఈ ప్రదర్శనతో అతను ఏకంగా నాలుగు స్థానాలు ఎగబాకి 853 రేటింగ్ పాయింట్లతో కెరీర్‌లోనే అత్యుత్తమ రెండో ర్యాంకును అందుకున్నాడు. భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ వన్డే ర్యాంకింగ్స్‌లోకి ఘనంగా పునరాగమనం చేశాడు. ఏడాది తర్వాత వన్డే ఆడిన సిరాజ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లో మంచి ప్రదర్శన కనబరిచి నేరుగా 17వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన మిచెల్ మార్ష్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానానికి చేరాడు. ఆసీస్ బౌలర్లు జోష్ హేజిల్‌వుడ్ 10వ, మిచెల్ స్టార్క్ 21వ ర్యాంకు సాధించారు.

### తెలంగాణలో నాలుగు రోజులు పాటు

# వానలే వానలు!

## దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

**హైదరాబాద్, మహా :** అగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారి ధర్మరాజు వెల్లడించారు. ఈ నెల 24, 25 తేదీల్లో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు పడుతున్నాయని వాతావరణశాఖ వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని తెలిపింది. రాగల 12 గంటల్లో ఇది మరింత బలపడి వాయిగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావం దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట్ జిల్లాలపై ఉంటుందని వివరించింది.

**ఆ రెండు రోజులు భారీ వర్షా లు కురిసే అవకాశం**

గురువారం దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసినప్పటికీ 24 తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో భారీ వర్ష సూచన ఉండే అవకాశం ఉందని ఐఎండీ అధికారి ధర్మరాజు తెలిపారు. 24, 25 తేదీల్లో భారీ వర్షాలు కురిసే నేపథ్యంలో పలు జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేశామని అన్నారు. నైరుతి రుతుపవనాలు విరమణ సమయంలో ఈశాన్యగాలుల రాష్ట్రంలో ప్రవేశిస్తుంటాయని తెలిపారు. ఇవి పూర్తిస్థాయిలో విస్తరిస్తున్నాయని అన్నారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ లో తుపానులు ఎక్కువగా ఏర్పడే అవకాశాలుంటాయని చెప్పారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనంగా కొనసాగుతున్న ప్రాంతం గుర్తింపదగ్గ అల్పపీడనంగాను తరువాత రాగల 12 రోజుల్లో వాయుగుండంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని అన్నారు.

### దానం సపోర్ట్ చేస్తే

# తప్పేంటి?

- మా పార్టీకి బహిరంగంగానే మద్దతు ఇస్తున్నారు
- కొండా వివాదం క్లోజ్.. జీవన్ రెడ్డిని త్వరలోనే సెట్ చేస్తాం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** దానం నాగేందర్ బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని, అందులో తప్పేముందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అలాగే సమయంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వివాదం ముగిసిపోయిందని క్లారిటీ ఇచ్చారు. బుధవారం టీపీసీసీ ఛీఫ్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మా స్టార్ క్యాంపెయినర్ లిస్టులో దానం నాగేందర్ పేరు ఉంటే తప్పేంటి?. ముసుగులో గుద్దులాటలు అవసరం లేదు.. దానం నాగేందర్ సపోర్ట్ డైరెక్ట్ చేస్తున్నాడు. మా పార్టీకి మద్దతు ఇస్తే తప్పేంటి?. ఫిరాయింపుల అంశాన్ని స్పీకర్ చూసుకుంటారు. జీవన్ రెడ్డి చాలా రోజుల నుంచి అసంతృప్తితో ఉన్నారు. జీవన్ రెడ్డిని త్వరలోనే సెట్ చేస్తాం. కొండా సుస్మిత వ్యాఖ్యలపై కొండా దంపతులు విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మళ్ళీ ఇలాంటివి జరగవని కొండా దంపతులు ముఖ్యమంత్రితో చెప్పారు. కొండా సురేఖ వివాదం ముగిసింది. రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను ఢిల్లీ వెళ్తాం. డీసీసీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తాం' అని చెప్పుకొచ్చారు.

# ఒక్క రోజులోనే రూ.10 వేలు

## తగ్గిన బంగారం ధర.. వెండి ఢమాల్.. భారీ పతనం

**హైదరాబాద్, మహా:** దేశంలో బంగారం ధర భారీగా తగ్గింది. బుధవారం ఒక్కరోజే రూ.10వేలు మేర తగ్గింది. 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,24,800కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,14,483కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,58,000కు చేరుకుంది. ఇటీవల బంగారం ధర భారీగా పెరిగిన విషయం తెలిసిందే. మళ్లీ ఇన్నాళ్లకు క్రమంగా తగ్గుతూ వస్తోంది. వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ప్రస్తుతం గోల్డ్ రేటు తగ్గడానికి కారణమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బంగారం ధరలు 60 శాతానికి పెరిగి గరిష్ఠ స్థాయికి చేరింది. త్వరలోనే ఔన్స్ బంగారం ధర ఏకంగా 5,000 డాలర్లకు పెరిగే అవకాశం ఉందని భావించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులపై కొనసాగుతున్న అనిశ్చితి కారణంగా బంగారం ధరలు భారీగా పెరిగాయి. అయితే మంగళవారం లాభాల స్వీకరణతో ఒక్కసారిగా అమ్మకాలు పెరిగి, ధరలు 6 శాతం వరకు పడిపోయాయి. బుధవారం ఆసియా మార్కెట్లలో కూడా ఈ పతనం కొనసాగింది. ఒక దశలో బంగారం ఔన్సు ధర 4,000 డాలర్ల వరకు తగ్గింది. వెండి కూడా అదే దారిలో నష్టపోయింది. దీని ప్రభావం బంగారం ఉత్పత్తిదారుల షేర్లపై తీవ్రంగా కనిపించింది. వెండి దారుణంగా పతనమైంది. ఒక దశలో కేజీ 2.03లక్షలకు వెళ్ళిన వెండి ఈ వారంలోనే 40వేల రూపాయలు తగ్గిపోయింది.



# రెండేళ్లలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం

## పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

(మొదటిపేజీ తరువాయి)

ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకు ఒకసారి సమావేశమై ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయ్యాక అక్కడ బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని రేవంత్ రెడ్డి పోలీసు శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఆస్పత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు ఇప్పటి నుంచే రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సీఎం సూచించారు.

**వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలి**

హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మిస్తున్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలలకు ప్రతీ నిర్మాణానికి ఒక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ అధికారి నిర్మాణాలను 24 గంటలు పర్యవేక్షించేలా పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించాలని సూచించారు. వచ్చే జూన్ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్‌రాజ్, క్రిస్టియానా, ఇలంబర్తి, ముషారఫ్ అలీ ఫరూఖీ, హరిచందన తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని చెక్ పోస్టులన్నీ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

పర్యవేక్షించి, చెక్ పోస్టులు మూసివేయబడినట్టుగా కొత్త బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. చెక్ పోస్టుల వద్ద విధుల్లో సిబ్బంది ఎవరూ లేకుండా తక్షణమే ఉపసంహరించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో చెక్ పోస్టులను సూచిస్తూ ఉన్న బోర్డులు, బారికేడ్లను తక్షణం తొలగించాలని డీటీఓలకు ఆదేశాలు జారీ చేశారు.

**మొత్తం వీడియో తీసి దాన్ని భద్రపరచాలి..**

ఈ తొలగింపు ప్రక్రియను మొత్తం వీడియో తీసి దాన్ని భద్రపరచాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, ఫర్నీచర్, ఇతర సామగ్రి, కంప్యూటర్లు, ఇతర వస్తువులను తక్షణం డీటీఓ కార్యాలయాలకు తరలించాలని, అలాగే పరిపాలనకు సంబంధించిన రికార్డులు, క్యాష్ బుక్స్, రిసిప్టులు, చాలాన్లను అన్నింటినీ డీటీవో కార్యాలయంలో భద్రపరచాలని ఆదేశించారు. ఇంతకాలం చెక్ పోస్టులు నిర్వహించిన స్థలాల్లో వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు. చెక్ పోస్టులను మూసివేసినట్టుగా, సిబ్బందిని రీడిప్లాయ్ చేసినట్టు, రికార్డులను భద్రపరిచిన విషయాలన్నింటిపైనా నివేదిక అందించాలని డీటీఓలను ఆదేశిస్తూ రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**చెక్ పోస్టులను రద్దు చేస్తున్నట్టు రవాణాశాఖ ఆదేశాలు..**

ఇక బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి రాష్ట్రంలోని అన్ని చెక్ పోస్టులను రద్దు చేస్తున్నట్టు రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో తొలగింపు ప్రక్రియ మొదలైంది.

# జూబ్లీహిల్స్‌పై కేసీఆర్ నజర్

## ఫామ్ హౌస్‌లో కేటీఆర్, హరీశ్ రావు భేటీ

### ఉప ఎన్నిక రోడ్‌షోలు, ప్రచార వ్యూహాలపై చర్చలు

### తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపైనా మంతనాలు

### జూబ్లీహిల్స్ లోని వివిధ ప్రాంతాల ఇన్‌ఛార్జ్ లతో నేడు కేసీఆర్ సమావేశం

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులతో సమావేశమయ్యారు. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారానికి సంబంధించి 40 మంది నాయకులతో బీఆర్ఎస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో కేసీఆర్ పేరు కూడా ఉండటంతో... ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ప్రచారంలో పాల్గొంటారని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ తమ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయడంపై చర్చించేందుకు కేటీఆర్, హరీష్ రావులు బుధవారం ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి కేసీఆర్‌తో సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ప్రచార వ్యూహాలపై వారు చర్చలు జరిపారు. అలాగే రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై కూడా వారు చర్చించినట్టుగా సమాచారం. ఇక, జూబ్లీహిల్స్‌లోని వివిధ ప్రాంతాల బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్‌లతో కేసీఆర్ గురువారం రోజు సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రచార వ్యూహాలపై వారికి ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

# నేడే టెండర్లు!

- హ్యామ్ రోడ్డు పనుల్లో కీలక ముందడుగు
- రూ.10,547.38 కోట్ల వ్యయంతో 32 ప్యాకేజీల్లో పనులు
- దేశానికి రోల్ మోడల్‌గా రోడ్లను నిలుపాలన్నదే లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, మహా:** నేడు హ్యామ్ రోడ్లకు టెండర్లు పిలువనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 5566.15 కిలోమీటర్ల రోడ్లను మొదటి విడత హ్యామ్ పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఈ రోడ్లకు రూ.10,547.38 కోట్ల వ్యయంతో పునరుద్ధరణ పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 32 ప్యాకేజీల్లో పనులు చేపట్టనున్నామని అన్నారు. దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణ రాష్ట్ర రోడ్లను నిలుపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. వాయిదా పడుతూ వస్తున్న హ్యామ్ రోడ్ల జాబితా తుది దశకు చేరింది. మొదటి సారిగా హ్యామ్ విధానంలో చేపట్టనున్న రోడ్ల నిర్మాణాలు సర్కార్ పచ్చ జెండా ఊపింది. మొదటి విడతలో 32 ప్యాకేజీల కింద రాష్ట్రవ్యాప్తంగా 5,566.15 కిలోమీటర్ల రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# పాక్‌లో ధరల మంటలు

## కిలో టమాటా రూ. 600, అల్లం రూ. 750.. బెండ రూ.300, ఉల్లి 120

(మొదటిపేజీ తరువాయి)



ముఖ్యంగా రావల్పిండి నగరంలో కిలో టమాటా ధర ఏకంగా 600 రూపాయలకు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం టమాటాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని, కానీ సరఫరా చాలా తక్కువగా ఉందని రావల్పిండి సబ్జీ మండీ ట్రేడర్స్ యూనియన్ అధ్యక్షుడు గులాం ఖాదిర్ తెలిపారు. "ఆఫ్ఘనిస్థాన్ నుంచి టమాటాల దిగుమతి పూర్తిగా నిలిచిపోయింది. సరఫరా తిరిగి పునరుద్ధరించబడే వరకు ధరలు తగ్గే అవకాశం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. టమాటాలే కాకుండా ఇతర కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. కిలో అల్లం ధర రూ. 750కి చేరగా, వెల్లుల్లి రూ. 400, బఠాణీలు రూ. 500 పలుకుతున్నాయి. ఉల్లిపాయల ధర కిలోకు రూ. 120కి పెరిగింది. క్యాప్సికమ్, బెండకాయలు కిలో రూ. 300 చొప్పున అమ్ముతున్నారు. గతంలో ఉచితంగా ఇచ్చే కొత్తిమీర చిన్న కట్ట ఇప్పుడు రూ. 50కి చేరిందని స్థానిక మీడియా పేర్కొంది. పండ్ల ధరలు కూడా ఇదే స్థాయిలో ఉన్నాయి. యాపిల్స్ కిలో రూ. 250 నుంచి 350, ద్రాక్ష రూ. 400 నుంచి 600 వరకు అమ్ముతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో చాలా మంది చిరు వ్యాపారులు టమాటాలు, బఠాణీలు, అల్లం, వెల్లుల్లి వంటివి అమ్మడం మానేశారు. పాకిస్థాన్ ఇటీవల ఆఫ్ఘన్ భూభాగంపై వైమానిక దాడులు చేయడం, ఆ దేశ శరణార్థులను బలవంతంగా వెనక్కి పంపడం వంటి పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఈ ఉద్రిక్తతలే ప్రస్తుతం నిత్యావసరాల సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ నుంచి దిగుమతి చేసుకునే కూరగాయల కంటే వాఘా సరిహద్దు ద్వారా భారత్ నుంచి వచ్చే కూరగాయలు చౌకగా లభిస్తాయని ఓ వ్యాపారి చెప్పినట్లు స్థానిక పత్రికలు నివేదించాయి.

## సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా..

బుధవారం సీఎస్ రామకృష్ణారావు హ్యామ్ విధానంలో చేపట్టనున్న 32 ప్యాకేజీల్లోని 5,566.15 కిలోమీటర్ల రహదారులకు రూ. 10,547.38 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. హ్యామ్ రోడ్లకు సంబంధించిన పనులకు టెండర్లు పిలువాలని రోడ్డు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని 400 రోడ్లను పునరుద్ధరించనున్నారు. హ్యామ్‌లో సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చనున్నారు. డబుల్ లేన్ రోడ్డును నాలుగు వరుసగా రోడ్డుగా మార్చనున్నారు. జున్ లో నిర్వహించిన మంత్రి వర్గ సమావేశంలో మొదటి విడతలో దాదాపు రూ.6478.33 కోట్లతో, 17 ప్యాకేజీల కింద 373 రోడ్లను నిర్మించేందుకు ఆమోదించింది. ఈ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 5190.25 కిమీటర్ల పొడువు రహదారులు నిర్మించేందుకు నిర్ణయించారు.

# మంత్రి కొండా సురేఖతో కాంగ్రెస్ పార్టీకి నష్టం


## కాంగ్రెస్ సీనియర్ నేత రాజనాల శ్రీహరి



**వరంగల్ మహా;** మంత్రి కొండా సురేఖ వల్ల కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత రాజనాల శ్రీహరి అన్నారు. మంత్రి కూతురు సుస్మిత పటేల్ సీఎం రేవంత్ రెడ్డి పై అలాగే సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యల పై ఖండిన రాజనాల వేం నరేందర్ రెడ్డి గతంలో తూర్పులో పోటీ చేయలేదని పశ్చిమ లో పోటీ చేసారని గుర్తు చేశారు. వేం నరేందర్ రెడ్డి వరంగల్ సికేం ఆసుపత్రిలో జన్మించారని, అతనికి 50 సంవత్సరాలుగా వరంగల్ లో ఇల్లు ఉన్నదని వారి తల్లిదండ్రులకు తూర్పు నియోజకవర్గ ప్రజలతో మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రి కొండా సురేఖకు సహకరించడం లేదని అనడం విడ్డూరంగా ఉందని కొండల్ రెడ్డి తిరుపతిరెడ్డి ప్రోటోకాల్ ప్రకారం సీఎం సోదరులకు గన్మెన్లు ఉంటే తప్పులేదని ఎక్స్ ఎమ్మెల్సీకి త్రీ ప్లస్ త్రీ గన్మెన్లు సీఎం కల్పించ లేదా అని ప్రశ్నించారు. ప్రవేట్ ఓఎస్డి సుమంత్ మంత్రి ఇంట్లో ఉంటే పోలీసులు అరెస్టు చేయడానికి వెళ్ళినప్పుడు పోలీసులు ఉండగా మంత్రి కొండా సురేఖ సుమంత్ ను మీడియా సాక్షిగా తన కారులో తీసుకొని వెళ్లడం సమంజసం కాదని ఎప్పుడు వివాదాల్లో ఉండే మంత్రి కొండా సురేఖ వేములవాడ కోడెల వివాదంతో పాటు సమ్మక్క సారక్క టెండర్ల విషయంలో భద్రకాళి సభ్యుల విషయంలో నాగార్జున సమంత వ్యక్తిగత విషయాలపై మాట్లాడడం తో పాటు సొంత పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల పై విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నియోజకవర్గంలోని గీసుకొండ పోలీస్ స్టేషన్ లో సిఐ కుర్చీలో కూర్చొని పంచాయతీ చేయడం తీవ్ర దుమారం లేపింది అన్నారు. కొండా మురళి కాంటెస్ట్ పొలిటిక్స్ అన్నది ఎంపీగా రెండుసార్లు ఎమ్మెల్యేగా జెడ్పిటిసి గా ఎందుకు ఓడిపోయారని ఈ విషయాలు గుర్తు లేదా అని గతంలో టిఆర్ఎస్ పార్టీ పరకాల నుండి సహోదరుడిని నిలబెట్టిండు మరి ఎందుకు ఓడిపోయారని కాంగ్రెస్ పార్టీ నుండి వద్దిరాజు రవి చంద్ర తూర్పులో నిలబెట్టి రవిచంద్ర ఎందుకు ఓడిపోయినాడు మంత్రి కూతురు సుస్మిత పటేల్ నాన్న గ్రౌండ్ లీడర్ అన్నప్పుడు వీరు ఎలా ఓడిపోయారని రాజనాల శ్రీహరి పూర్తిగా ప్రశ్నించారు.

# జి ప్లస్ 1తో ఇందిరమ్మ ఇండ్లు

- పట్టణ ప్రాంత పేదలకు శుభవార్త
- మేరకు జీవో 69 తో ఉత్తర్వులు జారీ
- మారనున్న మురికి వాడల రూపురేఖలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన



**హైదరాబాద్, మహా:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం గ్రామీణ ప్రాంతాలలో శర వేగంగా సాగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పై బుధవారం మంత్రి సచివాలయంలోని తన కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లోనివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటి వసతిని కల్పించేలా ఇందిరమ్మ పథకాన్ని వర్తింప చేస్తున్నామని అన్నారు. కనీసం 30 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జి ప్లస్ 1 తరహాలో ఇంటిని నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. గ్రౌండ్ ఫ్లోర్లో 200 చదరపు అడుగులు మొదటి అంతస్తులో మరో 200 చదరపు అడుగులు నిర్మించుకునేలా ఈ మేరకు జీవో ఎంస్ నె 69 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

**కొన్ని సడలింపులు ఇచ్చాం..**

పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇంటి వసతిని కల్పించాలన్న లక్ష్యంతో పాటు, స్థలాల కొరత ను దృష్టిలో ఉంచుకుని కొన్ని సడలింపులు ఇచ్చామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు పక్కా ఇంటి వసతి కోసం కొద్ది కాలంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై అధ్యయనం చేశామని తెలిపారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, నగరాల్లోని పేదలు సొంత ఇంటిని నిర్మించుకోడానికి తగిన స్థలం లేక , అరకొర వసతులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అటువంటి వారి కోసం ఇందిరమ్మ ఇండ్ల ను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అనేక మంది 60 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలోని రేకుల షెడ్లు, ఇతరత్రా తాత్కాలిక ఏర్పాట్లుతో జీవిస్తున్నారు. వీరికి ఆర్ సిసి స్లాబుతో పక్కా ఇంటిని నిర్మించాలంటే తగిన స్థలం అందుబాటులో లేదు. ఈ సమస్యను అధిగమించడానికి పట్టణ ప్రాంతాల్లో జి ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతినిస్తూ, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందచేస్తున్న రూ .5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశల వారీగా నిర్మాణపు పనుల స్థాయిని బట్టి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జి+1 విధానంలో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు 96 చదరపు అడుగుల విస్తీర్ణంలో , 70 అడుగుల విస్తీర్ణంలో వేర్వేరుగా రెండు గదులతోపాటు, కనీసం 35.5 చదరపు అడుగుల్లో వంటగదిని నిర్మించుకోవాలి, ప్రతి ఇంటికి ప్రత్యేకంగా టాయిలెట్, బాత్ రూంలు తప్పనిసరిగా ఉండాలని, ఈ ఇంటి నిర్మాణం ఆర్ సిసి స్లాబ్ తో ఉండాలని, ఇందుకు సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్లకు డిఇఇ (హౌసింగ్) అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

**నాలుగు దశల్లో రూ.5 లక్షలు చెల్లింపు..**

మొదటి అంతస్తు - రూఫ్ లెవల్ వరకు నిర్మాణం అయితే రూ. 1 లక్ష , అటు తరువాత గ్రౌండ్ ఫ్లోర్ - రూఫ్ వేసిన తరువాత రూ.1 లక్ష, ఆపైన ఫస్ట్ ఫ్లోర్ లో కాలమ్స్, స్లాబ్, గోడల నిర్మాణాలు పూర్తి అయిన పిదప రూ.2 లక్షలను, ఇంటి నిర్మాణపు పూర్తి అయిన తరువాత మరో లక్ష రూపాయలను విడుదల చేస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదవాళ్ల ఇంటికోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక ఎత్తు అయితే, పట్టణ ప్రాంతాల్లో మరో ఎత్తు అని, ఇది ప్రభుత్వానికి ఒక సవాల్ అని దీనిని దృష్టిలో ఉంచుకుని, పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# అవినీతికి అడ్డగా మారిన వరంగల్ ఆర్టీఏ

## ఏసీబీ అధికారుల పేరిట ఆర్టీఏ అధికారులకే టోకరా

## ఏకంగా రూ 10.20 లక్షలు కాజేసిన నకిలీ అధికారులు



**వరంగల్ మహా;** ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్ల ద్వారా సంబంధిత అధికారులకు వేల నుండి లక్షల్లో సంపాదన ఉంటుంది. వీరు వివిధ కోణాల్లో ప్రజల నుండి లంచాల పేరిట డబ్బులు దోచేస్తుంటారు. ఈ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఏసీబీ అధికారుల పేరిట ఇలాంటి అవినీతి అధికారులనే టార్గెట్ చేసి లక్షల్లో డబ్బులు దండుకున్న ఘటన వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో చోటుచేసుకుంది. తాజాగా ఏసీబీ అధికారులమని నమ్మించి వరంగల్ ఆర్టీఏ అధికారుల నుంచి ఏకంగా రూ.10.20 లక్షలు కాజేసిన ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ఆర్టీఏ చెక్ పోస్టుల్లో ఏసీబీ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి అక్కడ జరుగుతున్న అవినీతిని గుర్తిస్తున్నారు. ఈ తనిఖీల గురించి తెలుసుకున్న మాయగాళ్లు చరవాణి ద్వారా నేను ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్న మీరు లంచం బాగా తీసుకుంటున్నారట మీ మీద మాకు ఫిర్యాదులు వచ్చాయని మీరు వీలైనంత త్వరగా సెటిల్మెంట్ చేసుకోండి అంటూ డబ్బులు ఆన్ లైన్ అకౌంట్ కు పంపించండి అని ఓ అగంతకుడు నాలుగు రోజుల కిందట వరంగల్ ఆర్టీఏ అధికారులకు ఫోన్లు చేసి రూ. 10.20 లక్షల రూపాయలు వసూలు చేశారు. ఈ క్రమంలో వరంగల్ ఆర్టీఏ అధికారులకు గుర్తు తెలియని వ్యక్తులు 98868 26656,98804 72272.95919 38585 నుంచి ఫోన్ చేశారు. ఆర్టీఏ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అంతా మాకు తెలుసని, చట్టపరంగా అరెస్టు కాకుండా ఉండాలంటే చెప్పినంత డబ్బులు పంపించాలని ఎంవీఐల పై బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆందోళన చెందిన ఆర్టీఏ అధికారులు దశల వారీగా రూ.10.20 లక్షలను గుర్తు తెలియని వ్యక్తుల అకౌంట్ లో జమ చేశారు.

**అనుమానం వచ్చింది ఇలా..**

దుండగులతో ఫోన్లో మాట్లాడుతున్న క్రమంలో ఒక మోటర్ వెహికిల్ అధికారికి (ఎంవీఐ) కు అనుమానం వచ్చింది. వెంటనే వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్యను ఫోన్లో సంప్రదించగా అలాంటి ఫోన్స్ తాము చేయమని, గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో మిమ్ముల్ని మోసం చేశారని చెప్పడంతో పాటు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. కాగా, తాము మోసపోయిన విషయం బయట పడకుండా ఆర్టీఏ అధికారులు తీవ్రంగా ప్రయత్నించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విషయంలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, త్వరలోనే పూర్తి విషయాలు చెబుతామని దాటవేశారు.

**అప్రమత్తంగా ఉండాలి..**

కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మొబైల్ నంబర్ల ద్వారా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులమని చెప్పుకుంటూ నకిలీ కాల్స్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆ శాఖ డైరెక్టర్ జనరల్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ కాల్స్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి, వారిపై కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఇలాంటి ఒక సంఘటన పై ఇప్పటికే ఫిర్యాదు కూడా నమోదైందదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ ఇటువంటి మోసపూరిత కాల్స్ ను నమ్మి వారికి డబ్బు చెల్లించవద్దన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి, సాధారణ పౌరులకు ఎవరికైనా ఏసీబీ అధికారుల పేరుతో ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తే వారు తక్షణమే సమాచారం అందించాలన్నారు. ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930, లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్లు వాట్సాప్ 9440446106, Telangana ACB.2 @ Telangana ACB సమాచారం అందించాలన్నారు. బాధితులు, ఫిర్యాదుదారుల పేరు, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

# శబరి గిరుల్లో చారిత్రక ఘట్టం

## ఇరుముడితో పడి మెట్లెక్కిన రాష్ట్రపతి ముర్ము

### ప్రత్యేక పూజలు.. పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా చరిత్ర



**కేరళ, మహా:** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం స్వామివారిని దర్శించుకున్నారు. తద్వారా, ఈ ప్రఖ్యాత పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తొలి మహిళా దేశాధినేతగా ఆమె చరిత్ర సృష్టించారు. గతంలో 1970లలో మాజీ రాష్ట్రపతి వీవీ గిరి శబరిమలను సందర్శించగా, ఆ తర్వాత అయ్యప్పను దర్శించుకున్న రెండో భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. కేరళలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె శబరిమలకు చేరుకున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు పంబా బేస్ క్యాంపు వద్దకు వచ్చిన ఆమె, మొదట పంపా నదిలో పాదాలను శుభ్రం చేసుకుని, సమీపంలోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నల్ల చీర ధరించి సంప్రదాయబద్ధంగా 'కెట్టునిర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆమె 'ఇరుముడికెట్టు'ను సిద్ధం చేశారు. రాష్ట్రపతితో పాటు ఆమె అల్లుడు గణేష్ చంద్ర హోంబ్రామ్, ఇతర సిబ్బంది కూడా ఇరుముడిని సిద్ధం చేసుకున్నారు. పంబ నుంచి ప్రత్యేక వాహనంలో సన్నిధానానికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ తంత్రి కందరారు మహేష్ మోహనారు 'పూర్ణకుంభ' స్వాగతం పలికారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి వీఎన్ వాసవన్ కూడా ఆమెకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ద్రౌపది ముర్ము పవిత్రమైన ఇరుముడిని తలపై పెట్టుకుని, 18 మెట్లను ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆమె ఇరుముడిని ప్రధాన అర్చకులు తీసుకుని పూజలు నిర్వహించారు. ఆ తర్వాత మాలికాపురం ఆలయాన్ని కూడా ఆమె సందర్శించారు.

# చెక్ పోస్ట్ ల మాటున బీఆర్ఎస్ పాపాల పుట్టలా అవినీతి

## బ్రోకర్ వ్యవస్థను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం

### వాహన్, సారథిలో 28 రాష్ట్రాలు ఉన్నా పదేళ్లలో తెలంగాణ చేరలేదు

### చెక్ పోస్టులు రద్దు చేసినా అక్రమ రవాణా జరగకుండా ఎన్ఫోర్స్మెంట్ ఎక్కువగా చేస్తాం

### కీలక విషయాలు వెల్లడించిన మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, మహా:** మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెక్ పోస్ట్ ల మాటున గత పదేళ్లలో పాపాల పుట్టలా అవినీతి జరిగిందని ఆరోపించారు. ఇప్పటికే వాహన్, సారథిలో 28 రాష్ట్రాలు ఉన్నాయని, పదేళ్లలో తెలంగాణ ఎందుకు చేరలేదు? అని పొన్నం ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్ లోని ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి పొన్నం అనేక అంశాలపై మాట్లాడారు. 'తెలంగాణలో చెక్ పోస్టులు రద్దు బుధవారం నుంచి అమలు చేస్తూ జీవో జారీ చేశాం. చెక్ పోస్టుల రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి చర్యలు చేపడతాం. ఎన్ఫోర్స్మెంట్ కు సంబంధించిన అంశాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా ఆన్ లైన్ లో జరగడానికి చర్యలు చేపట్టాం. చెక్ పోస్టులను రద్దు చేస్తూ రెండు నెలల క్రితం నిర్ణయం తీసుకొని.. బుధవారం నుంచి అమలు చేస్తున్నాం. తెలంగాణలో ఈవీ పాలసీ తీసుకొచ్చిన తర్వాత రూ.577కోట్ల ట్యాక్స్ ప్రభుత్వం మినహాయించింది. ఈవీ వెహికిల్ అమ్మకాల షేర్ 0.03 నుంచి 1.13 శాతానికి పెరిగింది. ఇప్పుడు మేము వాహన్, సారథిలో చేరాం. డేటా ట్రాన్స్ఫార్మింగ్ జరుగుతోంది. వాహన్ అమలు చేస్తున్నాం.. సారథి అమలు చేస్తాం.. చెక్ పోస్టులు రద్దు చేసినా వాహనాల్లో అక్రమ రవాణా జరగకుండా ఎన్ఫోర్స్మెంట్ ఎక్కువగా చేస్తాం' అని పొన్నం చెప్పారు. ఢిల్లీ పొల్యూషన్ పరిస్థితి ఇక్కడ లేకుండా ఉండడానికి 'ఈవీ' పాలసీ తీసుకొచ్చాం. నగరంలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి ఇచ్చాం. ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు 10 వేలు చొప్పున అనుమతి ఇచ్చాం. 25 వేల రేటిరో ఫిటింగ్ ఆటోలకు అనుమతి ఇచ్చాం. రాష్ట్రంలో 'వాహన్' అమలవుతోంది. 'సారథి' త్వరలోనే తీసుకొస్తాం. 'స్క్రాపింగ్ పాలసీ' తీసుకొచ్చాం. వాహనాలకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేడియం స్టిక్కర్స్ అమలయ్యేలా తెచ్చాం. ఏఐ టెక్నాలజీను ఉపయోగించి రవాణా శాఖ కార్యాలయాల్లో రికార్డ్ చేస్తూ రెగ్యులర్ గా వచ్చే వాళ్ళని నోట్ చేసి.. హెడ్ ఆఫీస్ కి అలెర్ట్ చేస్తుంది. అలాంటి వాటిని నిరోధించడానికి ఏఐ ఉపయోగిస్తున్నాం. వెహికిల్ ట్రాకింగ్ ప్రాసెస్ కొనసాగిస్తున్నాం. ఆటోమేటిక్ డ్రైవింగ్ లైసెన్స్ సిస్టమ్ తీసుకొస్తున్నాం. టూరిజం వెహికల్స్ డబుల్ నెంబర్ ప్లేట్ తో పోతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో హై సెక్యూరిటీ ప్లేట్స్ తీసుకొస్తున్నాం. రోడ్ సేఫ్టీ క్లబ్స్ ద్వారా.. జూనియర్, డిగ్రీ, ఇతర కాలేజీలలో అవగాహన కల్పించేలా ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో 1.7 కోట్ల వాహనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. డిపార్ట్మెంట్ లో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పాత వాహనాలు, డబుల్ నంబరింగ్ అరికట్టడానికి మైనింగ్, ఇతర వాహనాలను మొదటి దశలో చూస్తున్నాం. రవాణా శాఖలోని 63 కేంద్రాల్లో కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతుంది. బ్రోకర్ వ్యవస్థను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. పోలీస్ శాఖ, ఆర్టీసీ, ఇతర విభాగాలలోని పాత వాహనాలను స్క్రాప్ కి పంపించాలని లేఖ రాశాం. చెక్ పోస్టులను రద్దు చేయాలని నేనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి కేబినెట్ లో పెట్టడం జరిగింది. వచ్చే ఆదాయాన్ని ఆన్లైన్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. చెక్ పోస్టులు రద్దు చేసిన తరుణంలో వాహనాల్లో అక్రమ రవాణా జరగకుండా ఎన్ఫోర్స్మెంట్ ఎక్కువ చేస్తాం.' అని మంత్రి పొన్నం వెల్లడించారు.

# ఉప ఎన్నిక..స్థానిక ఎన్నికల్లోనూ పొత్తు

## మాకు చాన్స్ ఇవ్వాలని టీపీసీసీ చీఫ్‌ను కోరాం: ప్రొఫెసర్ కోదండరాం

## టీజేఎస్ పార్టీ చీఫ్‌తో భేటీ అయిన మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాకుండా.. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ టీజేఎస్ మధ్య పొత్తు కొనసాగుతోందని ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం కోదండరాంతో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ భేటీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. అనంతరం కోదండరాం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌టీజేఎస్ పొత్తు కొనసాగుతుందని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో నిలిచే తమ పార్టీ నేతలకు సంబంధించిన కొంత మంది అభ్యర్థుల జాబితాను టీపీసీసీ చీఫ్‌కు ఇచ్చానని, వారికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నాని ఆయన మీడియాతో తెలిపారు. అలాగే తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు ఇచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం విషయంలో దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు మిత్రపక్షమైన టీజేఎస్‌కు భాగస్వామ్యం విషయంలో వేగంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో నవీన్ యాదవ్ జోరు

## భారీ మెజారిటీతో విజయం తథ్యం- మంత్రి పొన్నం

**జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ , యూసుఫ్ గూడ డివిజన్ వెంకటగిరి అయిలం కాలనీలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డోర్ టూ డోర్ ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజలకు అండగా నిలిచే నవీన్ యాదవ్ ను ప్రజలే గెలిపించుకుంటారు అని మంత్రి పొన్నం అన్నారు. ప్రజా పాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు మంజూరు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కి గ్యాస్, ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. మహిళలతో , వ్యాపారస్తులతో ముచ్చటించారు.. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి అధికార కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నీ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ సంపత్ కుమార్ , ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకరయ్య, శివసేన రెడ్డి ,బెల్లయ్య నాయక్ , గిరిధర్ రెడ్డి,ఇతర ముఖ్య నేతలు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు కేబినెట్ సమావేశం

- ప్రధానంగా బీసీ రిజర్వేషన్లపై చర్చించే అవకాశం
- ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సుకు మంత్రివర్గం ఆమోదం తెలిపే చాన్స్
- ఎస్ఎల్బీసీ, కాళేశ్వరం పునరుద్ధరణ, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులపై కూడా డిస్కషన్



**హైదరాబాద్, మహా:** నేడు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ భేటీ అవ్వనుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీ వేసింది. న్యాయ నిపుణుల రిపోర్ట్ ప్రభుత్వానికి చేరింది. కేబినెట్ ఈ నివేదికపై చర్చించి బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సమాలోచనలు జరపనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఎస్ఎల్బీసీ పునరుద్ధరణ, కాళేశ్వరం పునరుద్ధరణ, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం సహా పలు నీటి పారుదల ప్రాజెక్టులపై కేబినెట్ చర్చించనుంది. అలాగే ఎస్ఆర్ఎస్పీ రెండో దశకు రామిరెడ్డి దామోదర్ రెడ్డి పేరుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. వీటితోపాటు మరికొన్ని ప్రభుత్వ పాలసీ విధానాలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

# రోడ్లపై మంత్రులను తిరగనీయం

## బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులు.. బ్లాక్‌మెయిల్సా?

## ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు తప్పవు

## ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్




**హైదరాబాద్, మహా:** ఫీజు రీయింబర్స్‌మెంట్ పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్ ఫీజులన్నీ చెల్లించేవరకు విద్యాసంస్థలకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాలు లొంగవద్దని సూచించారు. వాయిదా పద్ధతుల్లో చెల్లింపులకు అంగీకరించవద్దన్నారు. ప్రభుత్వాన్ని బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్‌మెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు. బిహార్ ఎన్నికలకు డబ్బులు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా.. విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? తక్షణమే వాటిని చెల్లించాలి. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఈ నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదు. జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలవడం ఖాయం'' అని బండి సంజయ్ తెలిపారు.

# ఆదివాసీ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి.

**దమ్మపేట, మహా :** ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యదర్శి కొర్సా వెంకటేష్ దొర పిలుపునిచ్చారు. బుధవారం కొమరం భీమ్ జయంతి సందర్భంగా పట్టణంలోని కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల ను ఆనాడే గుర్తించి పోరాటం జరిపిన వీరుడని అన్నారు. భీమ్ స్ఫూర్తితో ప్రతి ఆదివాసీ బిడ్డ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో కుర్సం చిన్నరాజు ,ఊకే రాంబాబు ,పెనుబల్లి రమేష్ , తదితరులు పాల్గొన్నారు.



# సెంచరీకి చేరువలో డ్యూడ్..

## ఐదు రోజుల్లో ఎన్ని కోట్లో తెలుసా?

డ్రాగన్ హీరో ప్రదీప్ రంగనాథన్ నటించిన తాజా చిత్రం డ్యూడ్ కోలీవుడ్ హీరో నటించిన ఈ సినిమాకు తెలుగులోనూ రిలీజైంది. లవ్ టుడే, డ్రాగన్ చిత్రాలకు తెలుగు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 17న థియేటర్లలో విడుదలైంది. అయితే తొలి రోజు నుంచే ఈ మూవీకి పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్ల పరంగా అదరగొట్టింది. మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ. 22 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. గతంలో రిలీజైన డ్రాగన్ కంటే ఎక్కువగానే వసూళ్లు రాబట్టింది. రిలీజైన నాలుగు రోజుల్లోనే రూ.83 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. ఐదు రోజుల్లోనే సెంచరీకి చేరువలోకి వచ్చేసింది. వరల్డ్ వైడ్‌గా ఐదు రోజుల్లో రూ.95 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేసింది. ఈ విషయాన్ని మైత్రి మూవీ మేకర్స్ పోస్టర్ ద్వారా వెల్లడించింది. కాగా.. ఈ చిత్రంలో ప్రేమలు బ్యూటీ మమిత బైజు హీరోయిన్‌గా కనిపించగా.. ఆర్. శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించారు.



# కాంతార చాప్టర్ 1 మరో ఘనత..

రిషబ్ శెట్టి కాంతార చాప్టర్-1 బాక్సాఫీస్ వద్ద రికార్డుల ప్రభంజనం సృష్టిస్తోంది. దసరా కానుకగా థియేటర్లలో వచ్చిన ఈ సినిమా ఇప్పటికే రూ.700 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకెళ్తోంది. ఈ క్రమంలోనే పలు చిత్రాల ఆల్ టైమ్ వసూళ్లు రికార్డులను తుడిచిపెట్టేసింది. ఈ మూవీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వస్తోంది. దీపావళి కూడా కలిసి రావడంతో మరిన్ని రికార్డ్స్ క్రియేట్ చేయనుంది. ఈ ప్రీక్వెల్‌కు వస్తున్న ఆదరణ చూసి మేకర్స్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మూవీని ఇంగ్లీష్‌లోకి డబ్ చేసి రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. కాంతార చాప్టర్ 1 ఇంగ్లీష్ వర్షన్ అక్టోబర్ 31 విడుదల చేస్తామని పోస్టర్ పంచుకున్నారు. ఈ మూవీ రన్‌టైమ్ రెండు గంటల 14 నిమిషాల 45 సెకన్లుగా ఉంటుందని వెల్లడించారు. ఇండియన్ భాషల్లో రిలీజైన ఒరిజినల్ రన్‌టైమ్ రెండు గంటల 49 నిమిషాలు కాగా.. ఆంగ్ల వర్షన్‌లో ఏకంగా 35 నిమిషాలకు తగ్గించారు. ఇప్పటికే పలు రికార్డ్‌లు సాధించిన ఈ చిత్రం మరో ఘనతను సొంతం చేసుకుంది. ఇంగ్లీష్‌లోకి డబ్ చేసిన తొలి ఇండియన్ చిత్రంగా కాంతార చాప్టర్-1 నిలవనుంది. కాగా.. కాంతార చాప్టర్-1 ఇప్పటికే ఈ ఏడాది ఆస్ట్రేలియాలో అత్యధిక గ్రాస్ వసూళ్లు సాధించిన ఇండియన్ చిత్రంగా ఘనత దక్కించుకుంది. అంతేకాకుండా కేరళలోనూ రూ.55 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లతో దూసుకెళ్తోంది. రిషబ్ శెట్టి స్వీయదర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్, గుల్షన్ దేవయ్య, జయరామ్ కీలక పాత్రల్లో నటించారు.



# స్టార్ హీరో సినిమాలో ఇద్దరు హీరోయిన్లు?

హీరో విశాల్ వరుసగా చిత్రాలు చేసుకుంటూ పోతున్నారు. అంతేకాదు అనూహ్యంగా మెగాఫోన్ పట్టడం విశేషం. ప్రస్తుతం మగుడం అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. సూపర్‌గుడ్ ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మొదట రవి అరసును దర్శకుడిగా అనుకున్నారు. ఏమైందో ఏమో కానీ, ఇప్పుడు ఈ చిత్ర దర్శకత్వం బాధ్యతలను విశాల్ తన భుజాన వేసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన దీపావళి పండగ సందర్భంగా మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అందులో ఇది అనుకోకుండా జరిగిన విషయం కాదని, ముందుగా నిర్ణయించుకున్న విషయమేనని పేర్కొన్నారు. నిర్మాణ సంస్థ సహకారంతోనే మగుడం చిత్రానికి దర్శకత్వం బాధ్యతలను చేపట్టినట్లు చెప్పారు.

### దర్శకుడిగా..

ఈయన మొదట తుప్పరివాలన్– 2 చిత్రానికి దర్శకత్వం వహించాల్సి ఉంది. దానికంటే ముందే మగుటం చిత్రంతో దర్శకుడిగా మారుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇకపోతే ఈ చిత్రం తరువాత సుందర్.సీ దర్శకత్వంలో విశాల్ హీరోగా నటించనున్నట్లు సమాచారం. ఇంతకు ముందు వీరి కాంబోలో 12 ఏళ్ల క్రితం మదగజరాజా తెరకెక్కింది. ఈ మూవీ ఎన్నో ఏళ్ల జాడ్యం తర్వాత ఈ ఏడాది విడుదలై సంచలన విజయాన్ని సాధించింది. తాజాగా ఈ హిట్ కాంబో మరో చిత్రానికి సిద్ధం అవుతోంది.

### ఇద్దరు హీరోయిన్లు

సుందర్.సీ చిత్రాల్లో కమర్షియల్ అంశాలు మెండుగా ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా హీరోయిన్ల అందాల ఆరబోత కచ్చితంగా ఉంటుంది. వీరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమాలో విశాల్‌కు జంటగా మిల్కీబ్యూటీ తమన్నా, క్రేజీ బ్యూటీ కయాదు లోహర్ నటించడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది ఈ చిత్రం వచ్చే నెలలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో ఈ మూవీ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.



# డ్యూడ్ పై కేసు..

## ఇళయరాజాకు కోర్టు అనుమతి

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా డ్యూడ్ సినిమా యూనిట్‌పై దావా వేశారు. తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా విడుదలైంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన డ్యూడ్ చిత్రాన్ని దర్శకుడు కీర్తిశ్వరన్ తెరకెక్కించారు. అయితే, డ్యూడ్ సినిమాలో ఇళయరాజా సంగీతం అందించిన 'పుదు నెల్లు పుధు నాతు' చిత్రంలోని 'కరుతమచ్చన్' పాటను ఉపయోగించారు. మూవీలో ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు పెళ్లి సమయంలో ఈ సాంగ్ రన్ అవుతుంది. ఏదైనా ఒక పాత సినిమాకు సంబంధించి డైలాగ్స్, పాటలు వంటివి రీక్రియేట్ చేయాలంటే తప్పనిసరిగా అనుమతి ఉండాలి. ఈ మధ్య చాలామంది మేకర్స్ అనుమతి లేకుండా తీసుకోవడంతోనే ఇలాంటి సమస్య వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే డ్యూడ్ మేకర్స్‌తో పాటు సోనీ మ్యూజిక్‌పై ఇళయరాజా దావా వేశారు. గతంలో కూడా అజిత్ సినిమా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' విషయంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థపై ఇళయరాజా దావా వేసిన విషయం తెలిసిందే. అయితే, తాము అనుమతి తీసుకున్న తర్వాతే సాంగ్స్‌ను ఉపయోగించుకున్నామని మైత్రీ మూవీ మేకర్స్ అన్నారు. ఇప్పుడు డ్యూడ్ సినిమా పరంగా కూడా వారు మరోసారి చిక్కుల్లో పడ్డారు. డ్యూడ్ సినిమా విషయంలో దావా వేసేందుకు ఇళయరాజాకు కోర్టు అనుమతి ఇచ్చింది.



## వెంకటేశ్- త్రివిక్రమ్ కాంబో.. హీరోయిన్‌గా

# ఛాన్స్ కొట్టేసిన ముద్దుగుమ్మ!

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో జతకట్టిన సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వస్తోన్న ఈ చిత్రంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా టైటిల్‌పై టాలీవుడ్‌లో చర్చ మొదలైంది. అంతేకాకుండా హీరోయిన్ ఎవరనే విషయంపై కూడా ఫ్యాన్స్ తెగ ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా వెంకటేశ్ సరసన కనిపించనున్న హీరోయిన్ పేరును రివీల్ చేశారు మేకర్స్. ఈ చిత్ర నిర్మాణ సంస్థ హారికా అండ్ హాసిని క్రియేషన్స్ హీరోయిన్ పేరును వెల్లడించింది. కేజీఎఫ్‌తో స్టార్‌డమ్ దక్కించుకున్న శ్రీనిధిశెట్టి ఈ మూవీలో హీరోయిన్‌గా ఛాన్స్ కొట్టేసింది. ఇవాళ ఆమె బర్త్ డే కావడంతో మేకర్స్ ప్రత్యేకంగా విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనిధి శెట్టి పోస్టర్‌ను ట్విటర్ ద్వారా పంచుకున్నారు. కేజీఎఫ్ తర్వాత టాలీవుడ్‌లో నాని హిట్- 3, ఇటీవలే విడుదలైన సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా సినిమాలతో మెప్పించింది. కాగా..ఈ చిత్రం వెంకీ మామ కెరీర్‌లో 77వ సినిమాగా రానుంది. అయితే ఈ మూవీ టైటిల్ ఇంకా ప్రకటించలేదు.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034